సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం, 25, జూన్, 2024



ముంచుకొస్తున్న ముప్పు..

వర్షాకాలం ప్రారంభం కావడంతో దోమలు విజృంభించి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. 8లో



అశ్రునయనాల మధ్య..

పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిని రామచంద్రయ్య అంత్యక్రియలను కుటుంబసభ్యులు అశ్రు నయనాల నడుమ నిర్వహించారు. 8లో

గరిష్టం / కనిష్టం
34° / 26°

వాతావరణం

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని చోట్ల సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ముత్తంగి అలంకరణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్వామివారిని దేవనాథ రామానుజ జీయర్‌స్వామి దర్శించుకుని భక్తులకు ప్రవచనం అందజేశారు. కాగా, ప్రస్తుత ఈఓ రమాదేవి సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జ్ ఈఓగా శ్రీకాంత్‌రావు బాధ్యతలు స్వీకరించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.5 కోట్లు..

మణుగూరు రూరల్ : మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ బుర్రా వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేర కు కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. రూ.4.30 కోట్లతో కళాశాల నూతన భవనాన్ని నిర్మిస్తామని, రూ.40 లక్షలతో ఆధునిక డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేస్తామని వివరించారు. రూ.10 లక్షలతో కళాశాలలో ఫర్నిచర్, రూ.20 లక్షలు వెచ్చించి సైన్స్ ల్యాబ్‌ను ఆధునికీకరించనున్నట్లు తెలిపారు. త్వరలోనే పనులు చేపట్టి, ఏజెన్సీ విద్యార్థులకు సకల సౌకర్యాలతో నాణ్యమైన విద్యను అందిస్తామని పేర్కొన్నారు.

విద్యుత్ ప్రజావాణికి 8 ఫిర్యాదులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించారు. ఏఈ, ఏడీఏ, డీఈ కార్యాలయాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు, ఎస్ఈ కార్యాలయంలో మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు వినియోగదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించగా మొత్తం 8 ఫిర్యాదులు అందాయని ఎస్ఈ బి.భీకంసింగ్ తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీలోనూ బాలికలదే హవా..

కొత్తగూడెంఅర్బన్: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ప్రథమ సంవత్సరంలో బాలురు 2,212 మంది పరీక్ష రాయగా, 1,252 మంది మాత్రమే(56.6 శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 2,504 మంది పరీక్షకు హాజరు కాగా, 1,775 మందితో 70.89 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొత్తంగా మొదటి సంవత్సరంలో 64.19 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 2,294 మంది పరీక్ష రాయగా, 1,040 మంది(45.34 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇక ఒకేషనల్ ప్రథమ సంవత్సరంలో 704 మంది పరీక్ష రాయగా, 384 మంది, ద్వితీయ సంవత్సరం ఒకేషనల్‌కు సంబంధించి 494 మంది పరీక్ష రాయగా, 230 మంది ఉత్తీర్ణులయ్యారని జిల్లా ఇంటర్‌మీడియెట్ విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

వర్షంతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

సింగరేణి(కొత్తగూడెం): గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సింగరేణి వ్యాప్తంగా ఓసీల్లో సుమారు 50 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి విఘాతం ఏర్పడింది. రోజుకు 1.60 లక్షల టన్నులకు గాను 1.10లక్షల టన్నుల ఉత్పత్తి మాత్రమే నమోదైంది. కొత్తగూడెం రీజియన్‌లోని ఇల్లెందులో 11వేల టన్నులకు గాను 6వేల టన్నులు, కొత్తగూడెం ఏరియాలో 40వేల టన్నులకు 30వేలు, మణుగూరు ఏరియాలో 35వేల టన్నులకు గాను 25వేల టన్నుల ఉత్పత్తి జరిగింది.

మట్టి.. కొల్లగొట్టి !

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రైతులకు లబ్ధి చేకూర్చాల్సిన సారవంతమైన మట్టి రియల్ ఎస్టేట్ వెంచర్ల పాలవుతోంది. సేంద్రియ ఎరువుగా పంట దిగుబడి పెంచాల్సిన ఒండ్రు మట్టి.. రియల్టర్ల గల్లా పెట్టె నింపుకునేందుకు పునాదిగా మారుతోంది అనేందుకు జిల్లా వ్యాప్తంగా అనేక ఉదాహరణలు ఉన్నాయి. అందులో తాజాగా పాల్వంచ పట్టణంలోని చింతల చెరువు కూడా చేరింది.



చింతలచెరువు మట్టిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన టిప్పర్లు

రియల్టర్ల పాలవుతున్న చింతలచెరువు మట్టి

- 50 వేల క్యూబిక్ మీటర్ల పూడికతీతకు అనుమతి
- రైతుల పేరుతో వెంచర్లకు తరలిస్తున్న వైనం
- కాంట్రాక్టర్, రియల్టర్లకు కాసుల పంట
- పట్టించుకోని ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులు

50 వేల క్యూబిక్ మీటర్లు..

పాత పాల్వంచ, కొత్త పాల్వంచలకు నట్టనడుమన చింతల చెరువు ఉంది. దీంతో ఈ చెరువును సుందరీకరించాలని గత ప్రభుత్వ హయాంలో నిర్ణయించారు. ఈ మేరకు రూ.10 కోట్ల అంచనా వ్యయంతో నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో సుందరీకరణ పనులు చేపడుతున్నారు. కరకట్ట విస్తరణ, లైటింగ్, కరకట్ట రివిట్‌మెంట్, అప్రోచ్ రోడ్లు, స్వాగత తోరణాలు నిర్మిస్తున్నారు. వీటితో పాటు చెరువు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని పేరుకుపోయిన పూడిక మట్టిని కూడా తీయాలని నిర్ణయించారు. చింతల చెరువు సుమారు 96 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో సుమారు 50 వేల క్యూబిక్ మీటర్ల మట్టి తీయాలని ఇరిగేషన్ శాఖ నిర్ణయించింది.

రైతులకు అవకాశం..

చెరువులోని పూడిక మట్టిని పొలాల్లో పోస్తే నేల సారవంతం అవుతుంది. మరీ బీడు భూముల్లో అయితే సగటున ఎకరాకు పది ట్రాక్టర్ల పూడిక మట్టి అవసరం ఉండగా, సాగులో ఉన్న నేలయితే నాలుగు నుంచి ఐదు ట్రాక్టర్ల మట్టి సరిపోతుంది. ఒకసారి పూడిక మట్టితో నింపితే ఐదారేళ్ల పాటు నేలకు బలం చేకూరుతుంది. ప్రతీ సీజన్‌లో కాంప్లెక్స్ ఎరువుల రూపంలో రైతులకు ఎకరాకు సగటున రూ.2,500 వరకు పెట్టుబడి ఖర్చు మిగులుతుంది. పూడిక మట్టి వినియోగిస్తే సాగులో అనేక ప్రయోజనాలు ఉండడంతో మిషన్ కాకతీయ మొదలు ఎక్కడ చెరువులో మట్టి తీసినా రైతులకు ఉచితంగా ఇవ్వాలని సర్కారు నిర్ణయించింది. మట్టి కావాల్సిన రైతులు ఆయా ప్రాంతాల వారీగా ఇరిగేషన్ అధికారిని సంప్రదించాలి. అక్కడ ఇచ్చిన అనుమతి చిటీని చెరువు దగ్గర పని ప్రదేశంలో కాంట్రాక్టర్‌కు చూపించి మట్టిని ఉచితంగా తీసుకెళ్లొచ్చు. కేవలం రవాణా చార్జీలే రైతులు భరించాల్సి ఉంటుంది.

కొరవడిన సమన్వయం..

నీటి పారుదల, వ్యవసాయ శాఖలు రైతులకు మేలు చేసేందుకు ఉద్దేశించినవే. అయితే ఈ రెండు శాఖల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. చింతల చెరువులో పూడిక తీస్తున్న 50 వేల క్యూబిక్ మీటర్ల మట్టికి సంబంధించిన సమాచారాన్ని కనీస స్థాయిలో కూడా ప్రచారం చేయలేదు. రైతువేదికలు ఉన్నా వాటిని ఉపయోగించుకోలేదు. మూడున్నర వేల ఎకరాలకు సరిపడా పూడిక మట్టి వెలికితీసినా కనీసం పది మంది రైతులకు కూడా ప్రయోజనం కలగని పరిస్థితి నెలకొంది. ఎవరి వారే యమునా తీరే అన్నట్టుగా ఇరిగేషన్, వ్యవసాయ అధికారులు వ్యవహరిస్తూ చింతల చెరువు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్, స్థానికంగా ఉన్న రియల్ వెంచర్లు వేసిన వ్యాపారులకు లబ్ధి జరిగేలా వ్యవహరించారనే విమర్శలు వస్తున్నాయి. చింతల చెరువు పూడికపై విచారణ జరిపి పక్కదారి పట్టిన పూడిక మట్టి లెక్క తేల్చి, బాధ్యులకు జరిమానా విధించాలని రైతులు కోరుతున్నారు. అంతేకాకుండా ఇకపై చెరువుల సంరక్షణ, పూడికతీత వ్యవహారాల్లో స్థానికంగా ఉన్న రైతులకు సమాచారం అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

రైతుకు తక్కువ.. 'రియల్'కు ఎక్కువ..

చింతల చెరువు నుంచి పూడిక తీస్తున్న 50 వేల క్యూబిక్ మీటర్ల మట్టి గత రెండు నెలలుగా రైతుల పొలాలకు అరకొరగా సరఫరా అవుతుండగా.. స్థానికంగా ఉన్న రియల్ ఎస్టేట్ వెంచర్లకు వందల కొద్దీ టిప్పర్లు, వేల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. రైతులకు చెందాల్సిన మట్టిని పని దక్కించుకున్న కాంట్రాక్టర్ లెక్కా పత్రం లేకుండా ఇష్టారీతిగా రియల్ వెంచర్లు, ప్రైవేటు రంగంలో జరుగుతున్న నిర్మాణాలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ఎన్నో ఏళ్లుగా చెరువు గర్భంలో పేరుకుపోయిన సారవంతమైన మట్టి రియల్ వెంచర్లలో వృథా అవుతోంది. గత రెండు నెలలుగా ట్రాక్టర్ మట్టి రూ. 500, లారీకి రూ.3,000 చొప్పున వసూలు చేస్తూ విక్రయిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. కరకట్ట బలోపేతానికి అరకొరగా కొంత పూడిక మట్టిని పోసి తమ తప్పులను కప్పి పుచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.



ఓ వెంచర్‌లో పోసిన చెరువు మట్టి

ఐటీడీఏ పీఓగా రాహుల్

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏ పీఓగా బి.రాహుల్ నియమితులయ్యారు. మంచిర్యాల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనను పీఓగా నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రాహుల్ సివిల్స్‌లో తొలి ప్రయత్నంలోనే ఆలిండియా 272వ ర్యాంక్ సాధించారు.

కుటుంబనేపథ్యం ఇలా..

తెలంగాణలోని నారాయణపేట జిల్లాకు చెందిన రాహుల్ తల్లిదండ్రులు ఇద్దరూ ఉపాధ్యాయులే. తండ్రి పీఈటీ కాగా, తల్లి హిందీ పండిట్. అక్క ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో, బావ పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలు చేస్తున్నారు. ప్రేమ వివాహం చేసుకున్న రాహుల్ సతీమణి మనీష కూడా ప్రభుత్వ ఉపాధ్యాయురాలే. ఒకటి నుంచి పదో తరగతి వరకు నారాయణపేటలోని దయానంద స్కూల్‌లో తెలుగు మీడియం, ఇంటర్‌మీడియెట్ హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో చదివారు. వరంగల్ నిట్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేశాక ప్రైవేట్ కంపెనీలో, ఆ తర్వాత టీఎస్ఎన్‌డీసీలో ఏఈగా ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. ఉద్యోగం చేస్తూనే సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యారు. అనంతరం ఢిల్లీలో 13 నెలల పాటు పూర్తి స్థాయిలో సిద్ధమై 2020 సివిల్స్‌లో తొలి ప్రయత్నంలో ఉత్తమ ర్యాంక్ సాధించారు. ఆ జిల్లా నుంచి సివిల్స్‌కు ఎంపికైన తొలి యువకుడు రాహులే కావడం విశేషం. చదువుతో పాటు బ్యాడ్మింటన్ క్రీడలోనూ మంచి ప్రావీణ్యం ఉంది. శిక్షణలో భాగంగా ఖమ్మంలో అసిస్టెంట్ కలెక్టర్‌గా పని చేశారు.



పీఓగా నియమితులైన రాహుల్

తెలుగు భాషపై పట్టు..

ఆప్షనల్‌గా తెలుగు సబ్జెక్టును ఎంచుకుని సివిల్స్‌లో ర్యాంక్ సాధించిన రాహుల్‌కు తెలుగు భాష, సాహిత్యంపై మంచి పట్టుంది. తన ప్రేమయాత్రను, వివాహ శుభలేఖను సైతం యానిమేషన్ రూపంలో అచ్చ తెలుగులో రూపొందించి విడుదల చేయడం గమనార్హం. మంచిర్యాలలో సబ్‌కలెక్టర్‌గా సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించారనే పేరు ఉంది. ప్రభుత్వ పాఠశాలలో చదివి మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు, ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు అభినందన లేఖలు రాసి, వారిని సత్కరించారు. ఇలాంటి సామాజిక నేపథ్యం గల అధికారి ఐటీడీఏ పీఓగా వస్తుండడంతో గిరిజనాభివృద్ధికి కృషి చేస్తారని జిల్లా వాసులు ఆశిస్తున్నారు.

ప్రజావాణికి పోటెత్తారు..



వినతులు ఇచ్చేందుకు బారులుదీరిన ప్రజలు

బారులుదీరిన దరఖాస్తుదారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): నూతన కలెక్టర్‌గా జితేష్ వి పాటిల్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చారు. ప్రియాంక ఆల ఉన్నప్పుడు వివిధ సమస్యలపై దరఖాస్తు చేసిన వారు కూడా మళ్లీ రావడంతో కలెక్టరేట్ కిక్కిరిసిపోయింది. ప్రజావాణి నిర్వహిస్తున్న హాల్‌లోకి పలువురు చొచ్చుకెళ్లడానికి ప్రయత్నించడంతో పోలీసులు రంగప్రవేశం చేసి క్యూ ప్రకారం హాల్‌లోకి అనుమతించారు. ఈ సందర్భంగా పోలీసులతో దరఖాస్తుదారులు వాగ్వాదానికి దిగారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్.. పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓలు మధు, దామోదర్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల్లో కొన్ని ఇలా..

- తమ ఇంటి పక్కన పెద్ద మురికి కాలువ ఉందని, 24వ వార్డు కౌన్సిలర్ దీన్ని ఎత్తులేపి స్లాబ్ నిర్మించారని, దీంతో వర్షం వచ్చినప్పుడు కాలువ పొంగి మురుగు నీరంతా తమ ఇంట్లోకి వస్తోందని, దుర్వాసనను భరించలేకపోతున్నామని కొత్తగూడెం మున్సిపాలిటీ 34వ వార్డుకు చెందిన గూడ విజయ ఫిర్యాదు చేయగా, సమస్య పరిష్కరించాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌కు ఎండార్స్ చేశారు.



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ జితేష్

- సర్వే నంబర్ 55/18లో ఉన్న వ్యవసాయ భూమిని తనకు అప్పగించాలని జడ్జిమెంట్ వచ్చిందని, అయినా సమస్య అలాగే ఉందని గుండాల మండలం కాచనపల్లి గ్రామానికి చెందిన కుంజ వెంకయ్య దరఖాస్తు చేయగా తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.
- ఎస్టీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న హాస్టళ్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పరిగణించి వేతనాలు పెంచాలని పలువురు అందజేసిన దరఖాస్తును జిల్లా పరిపాలనాధికారికి ఎండార్స్ చేశారు.
- చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలో సర్వే నంబర్ 161/5లో ఉన్న స్థల వివాదం కలెక్టర్ కోర్టులో పెండింగ్‌లో ఉండగా ఒకరు అక్రమంగా షెడ్డు నిర్మించారని కోటా శివశంకర్ ఫిర్యాదు చేయగా లీగల్ సెల్‌కు ఎండార్స్ చేశారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి

భద్రాచలం: ఏజెన్సీలోని గిరిజనుల సమస్యల పరిష్కారానికి అధికారులు నిరంతరం కృషి చేయాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన వివిధ ప్రాంతాల గిరిజనుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమైన ఏపీఓ మాట్లాడుతూ అర్హతల ఆధారంగా దరఖాస్తులను పరిశీలించాలని, ఈ విషయంలో అలసత్వం వహించొద్దని తెలిపారు. అలాగే, వర్షాలు మొదలైనందున సీజనల్ వ్యాధుల నియంత్రణపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తానాజీ, వెంకటేశ్వరరాజు, సురేష్‌బాబు, శ్రీనివాస్, మునీర్‌పాషా, భాస్కరన్, రమణయ్య, నరేష్, దుర్గయ్య, హరికృష్ణ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



గిరిజనుల సమస్యలను తెలుసుకుంటున్న ఏపీఓ డేవిడ్‌రాజ్

గురుకుల టెండర్లు రేపటికి వాయిదా

పాల్వంచరూరల్ : 2024 – 25 విద్యా సంవత్సరంలో జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పాలు, కూరగాయలు, మటన్, చికెన్‌తో పాటు ఇతర ఆహార పదార్థాల సరఫరాకు సంబంధించిన టెండర్ల నిర్వహణను ఈనెల 26వ తేదీకి వాయిదా వేసినట్లు గురుకులాల ప్రాంతీయ సమన్వయాధికారి కె.ప్రత్యూష తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 24వ తేదీనే టెండర్లు నిర్వహించాల్సి ఉండగా, అనివార్య కారణాలతో రెండు రోజులు వాయిదా వేశామని పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు కలెక్టరేట్‌లో టెండర్ల ప్రక్రియ చేపడతామని వివరించారు.

డిజి'డల్' బోధన..

- నెట్, విద్యుత్ సమస్యలంటూ పక్కన పడేసిన ప్యానళ్లు
- రూ.లక్షలు వెచ్చించినా నెరవేరని లక్ష్యం
- డిజిటల్ బోధన అందక నష్టపోతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

కొత్తగూడెంఅర్బన్: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు ప్రతి ఏడాది నూతన పథకాలను అమలు చేస్తున్నప్పటికీ.. క్షేత్ర స్థాయిలో అవి పూర్తిగా అమలు కావడం లేదు. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతో కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇష్టారాజ్యం అన్నట్టుగా సాగుతోంది. దీనికి కొన్ని ఉపాధ్యాయ సంఘాలు తోడవుతుండడంతో నిర్లక్ష్యం మితిమీరిపోతోందనే ఆరోపణలు వస్తున్నాయి. తద్వారా విద్యార్థులు కూడా నష్టపోతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు డిజిటల్ బోధన అందించేందుకు రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్(ఐఎఫ్‌పి)ను ఏర్పాటుచేసింది. జిల్లాలో వీటికి అనుగుణంగా గదులు ఉన్న 270 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేశారు. మొదటి విడతగా జిల్లాలో 60, రెండో విడతలో 100, మూడో విడతలో 110 పాఠశాలలకు మూడు చొప్పున ప్యానళ్లు మంజూరు చేశారు. ప్రారంభంలో ఆయా స్కూళ్లలో డిజిటల్ బోధన జరిగినా.. ఆ తర్వాత ప్యానళ్లను పక్కన పడేసి మామూలుగానే బోధిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎంపిక చేసిన 270 పాఠశాలల్లో పది శాతం పాఠశాలల్లో మాత్రమే డిజిటల్ బోధన సాగుతుండగా.. 90 శాతం స్కూళ్లలో సాధారణ బోధనే సాగుతోంది. దీంతో విద్యార్థులు సాంకేతిక విద్యలో వెనుకబడే ప్రమాదం ఉందని విద్యావేత్తలు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అన్ని పాఠశాలల్లో డిజిటల్ బోధన కొనసాగేలా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ప్రభుత్వ పాఠశాలలో మూసిఉన్న డిజిటల్ ప్యానల్

నెట్, విద్యుత్ సమస్యల పేరుతో..

జిల్లాలోని 270 పాఠశాలల్లో డిజిటల్ ప్యానళ్లు ఉన్నాయి. వీటిని ఏర్పాటు చేసే సమయంలోనే ఇంటర్‌నెట్ కనెక్షన్ ఇవ్వాల్సి ఉండగా నాడు అధికారులు పట్టించుకోలేదు. దీంతో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్‌ల నుంచి ప్యానళ్లకు ఇంటర్‌నెట్ కనెక్షన్ ఇచ్చి బోధించారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా సుమారు 20 పాఠశాలల్లో మాత్రమే ఇలా బోధన జరుగుతోంది. మిగతా పాఠశాలల ఉపాధ్యాయులు తమ ఫోన్ల ద్వారా నెట్ వినియోగానికి ముందుకు రాకపోవడంతో సాధారణ పద్ధతిలోనే పాఠాలు చెబుతున్నారు. మరి కొన్ని పాఠశాలల్లో తరుచూ విద్యుత్ సమస్య తలెత్తుతోందని, దీంతో డిజిటల్ బోధన చేయలేకపోతున్నామని ఉపాధ్యాయులు అంటున్నారు. ఇక జిల్లాలో అత్యధిక ప్రాంతాలు మారుమూలన ఉండే ఏజెన్సీ ఏరియాలే కావడంతో అక్కడ సెల్‌ఫోన్ సిగ్నళ్లు సరిగా ఉండడం లేదు. ఏదేమైనా ఒక్కో ఐఎఫ్‌పీ ప్యానల్‌కు రూ.3 లక్షల చొప్పున ఖర్చు చేయగా ప్రస్తుతం అవి నిరుపయోగంగా ఉంటున్నాయి. ముఖ్యంగా 8, 9, 10 తరగతి విద్యార్థులకు సంబంధించి ప్రతీ సబ్జెక్టును ప్యానళ్లలో లోడ్ చేసి బోధిస్తే వారు పాఠ్యాంశాలతో పాటు సమాజంపై అవగాహన కలిగే అంశాలు, ప్రాంతాలు, వాటి ప్రాముఖ్యత, జనరల్ నాలెడ్జ్ వంటి మరెన్నో నేర్చుకునే అవకాశం ఉంటుంది. ఈ మేరకు అన్ని పాఠశాలల్లో విద్యుత్, ఇంటర్‌నెట్ ఏర్పాటు చేయడంపై విద్యాశాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

డిజిటల్ బోధనకు చర్యలు చేపడతాం



జిల్లాలోని 270 పాఠశాలల్లో డిజిటల్ బోధన నిర్వహణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటాం. విద్యార్థులకు సాంకేతిక పరమైన నాలెడ్జ్ రావాలంటే ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఐఎఫ్‌పీ ప్యానళ్లను వినియోగించి డిజిటల్ బోధన చేయాల్సిందే.

– ఎం.వెంకటేశ్వరాచారి, డీఈఓ

'సికిల్ సెల్' నివారణకు ప్రత్యేక శిబిరాలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సికిల్‌సెల్ అనీమియా వ్యాధిని శాశ్వతంగా నివారించేందుకు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్న 50 ఆశ్రమ పాఠశాలలు, 23 పీఎంహెచ్, 30 వసతి గృహాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ఈనెల 19 నుంచి జూలై 3 వరకు గిరిజన ప్రాంతాల్లో క్యాంపుల ఏర్పాటుపై మినిస్టరీ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ జాయింట్ సెక్రటరీ జయ సోమవారం న్యూఢిల్లీ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఐటీడీఏ పీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీసీలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ వ్యాధిపై ప్రజల్లో, ముఖ్యంగా గిరిజనుల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ..

కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం తనిఖీ చేశారు. గోడౌన్ వద్ద పటిష్ట భద్రత కొనసాగించాలని అధికారులకు సూచించారు. పక్కనున్న పాత భవనాన్ని తొలగించి ఎన్నికల ప్రక్రియ సమయంలో వినియోగించేలా షెడ్డు నిర్మించాలని ఆదేశించారు. ఆయన వెంట దారా ప్రసాద్, రంగప్రసాద్, కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య తదితరులు ఉన్నారు.

అగ్రికల్చర్ డ్రోన్ల పనితీరు పరిశీలన..

గోదావరి వరదల నుంచి ప్రజలను రక్షించేందుకు వినియోగించనున్న అగ్రికల్చర్ డ్రోన్ల పనితీరును కలెక్టర్ జితేష్ పరిశీలించారు. వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు వీటిని ఉపయోగిస్తామని, ఖమ్మం నుంచి ప్రత్యేకంగా తెప్పించామని తెలిపారు. బాధితులకు తాగునీరు, ఆహారం డ్రోన్ల ద్వారా అందిస్తామన్నారు. 90 నుంచి 250 మీటర్ల ఎత్తు వరకు డ్రోన్లు వెళ్లే అవకాశం ఉందని, వరదల్లో చిక్కుకున్న వారికి తాళ్లు పంపించి రక్షించే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో డీఏఓ బాబురావు, ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్, మత్స్య శాఖ ఏడీ వీరన్న, కలెక్టరేట్ ఏఓ గన్యా తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీలో రూ.908 కోట్ల రుణమాఫీ

- 1.69లక్షల మంది రైతుల వివరాలతో ప్రతిపాదనలు
- వెల్లడించిన బ్యాంకు చైర్మన్ వెంకటేశ్వరరావు

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన రైతుల రుణమాఫీ ప్రక్రియ ప్రారంభమైందని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఖమ్మంలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ప్రభుత్వ ప్రకటన మేరకు డీసీసీబీ పరిధిలోని వంద పీఏసీఎస్‌ల ద్వారా 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు రూ.2లక్షల మేర 1,69,868 మంది రైతులు రూ.908.28 కోట్ల రుణాలు తీసుకున్నారని తెలిపారు. ఇందులో 1,67,036 మంది రూ.844.84 కోట్ల పంట రుణాలు రెన్యూవల్ చేసుకోగా, మిగిలినవి కొత్త రుణాలు ఉన్నాయని చెప్పారు. ఈ ప్రతిపాదనల ఆధారంగా రుణమాఫీకి అర్హుల వివరాలను ప్రభుత్వం గుర్తిస్తుందని తెలిపారు.

క్లుప్తంగా

డ్రైవర్, కండక్టర్ నిజాయితీ



ప్రయాణికుడికి బ్రాస్‌లెట్ అందజేస్తున్న డీఎం, ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు పోగొట్టుకున్న బంగారు బ్రాస్‌లెట్‌ను డ్రైవర్, కండక్టర్ తిరిగి అప్పగించారు. ఖమ్మం డిపోకు చెందిన బస్సు సోమవారం భద్రాచలం రూట్‌లో నడిచింది. భద్రాచలంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న బండారుపల్లి సుధాకర్ బస్సులో 12 గ్రాముల బంగారు బ్రాస్‌లెట్ పోగొట్టుకున్నాడు. ఈ విషయాన్ని గుర్తించిన ఆయన ఖమ్మం డిపోలో సంప్రదించగా.. అప్పటికే కండక్టర్ వి.మల్లికాంబ, డ్రైవర్ జి.లక్ష్మయ్య అధికారులకు అందజేశారు. దీంతో బ్రాస్‌లెట్ సుధాకర్‌దేనని నిర్ధారించుకున్న డీఎం శ్రీనివాసరావు, ఉద్యోగులకు ఆయనకు అప్పగించగా డ్రైవర్, కండక్టర్‌ను పలువురు అభినందించారు.

అటవీ జంతువు మాంసం స్వాధీనం

దమ్మపేట: దమ్మపేట ఫారెస్టు అధికారులు సోమవారం దాడి చేసి అటవీ జంతువు మాంసాన్ని పట్టుకున్నారు. ఫారెస్టు రేంజర్ కరుణాకరా చారి కథనం ప్రకారం.. దమ్మపేట రేంజ్ పరిధిలోని అశ్వారావుపేట మండలం భీమునిగూడెం శివారు ఓ వ్యవసాయ క్షేత్రంలో కొందరు వ్యక్తులు అడవి పంది మాంసాన్ని విక్రయిస్తుండగా అటవీ శాఖ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. నిందితులు పారిపోగా, కేజీన్నర అడవి పంది మాంసంతోపాటు ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని రేంజ్ ఆఫీసుకు తరలించినట్లు రేంజర్ తెలిపారు. అడవి పంది అచ్యుతాపురం సమీపంలోని అటవీ ప్రాంతంలో వేటగాళ్లకు చిక్కినట్లు తెలిసిందని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆలయంలో హుండీ చోరీ

చండ్రుగొండ: మండల పరిధిలోని రేపల్లెవాడ శ్రీకోదండరామాలయంలో ఉన్న హుండీని సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. హుండీని ఆలయం నుంచి సమీపంలోని పంటచేల వద్దకు తీసుకెళ్లి పగులగొట్టారు. హుండీలో సుమారు రూ.60 వేల విలువైన కానుకలను చోరీ చేశారని గ్రామస్తులు తెలిపారు.

ఇద్దరు నిందితుల అరెస్ట్

అశ్వాపురం: అశ్వాపురం, మణుగూరు, భద్రాచలం తదితర ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని టీడీపీ సెంటర్‌లో వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులను గమనించిన ఇద్దరు వ్యక్తులు పారిపోయేందుకు యత్నించారు. దీంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. మిట్టగూడెం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే కుంజా భిక్షం సతీమణి కుంజా రాణి ఈ నెల 19న ఇంటికి తాళం వేసి హైదరాబాద్ కుమారుడి దగ్గరికి వెళ్లగా, ఇంటి తాళం పగులగొట్టి కొంత నగదు దొంగిలించినట్లు అంగీకరించారు. అశ్వాపురం, మణుగూరు, భద్రాచలం తదితర ప్రాంతాల్లో కూడా చోరీలకు పాల్పడ్డారు. దీంతో నిందితులు, మణుగూరు మండలం విఠల్‌రావు నగర్‌కు చెందిన గంటా ప్రవీణ్‌కుమార్, గంటా జగదీష్‌పై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. ఎస్సై తిరుపతిరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


డివైడర్‌ను ఢీకొట్టిన బొగ్గు టిప్పర్



ధ్వంసమైన శిలాఫలకం

టేకులపల్లి: మండల కేంద్రంలోని పోస్టాఫీసు సెంటర్‌లో ఆదివారం బొగ్గు టిప్పర్ డివైడర్‌ని ఢీకొట్టింది. కాగా సోమవారం కూడా కేటీసీ నుంచి బొగ్గు లోడుతో వచ్చిన మరో టిప్పర్ డివైడర్‌ను ఢీకొట్టగా అక్కడి శిలాఫలకాలు ధ్వంసమయ్యాయి. ఇరువైపులా ఉన్న దుకాణదారులు రోడ్డుకు ఆనుకునే సరుకులు పెడుతుండటం, వాహనాలు రోడ్డుపైనే నిలుపుతుండటంతో కేటీసీ నుంచి బొగ్గు లారీలు, టిప్పర్లతో పాటు ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. వ్యాపారులకు గ్రామ పంచాయతీ అధికారులు నోటీసులు ఇచ్చి జరిమానా విధించినా మార్పు రావడం లేదు. ఇప్పటికైనా పోలీసులు, గ్రామ పంచాయతీ అధికారులు కఠిన చర్యలు తీసుకుని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,438

ముంచుకొస్తున్న ముప్పు..

వర్షాలతోపాటే మొదలైన జ్వరాలు

- జిల్లాలో ఇప్పటికే 32 మలేరియా, 11 డెంగీ, 27 టైఫాయిడ్ కేసులు
- 171 సమస్యాత్మక గ్రామాలను గుర్తించిన యంత్రాంగం
- సీజనల్ వ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి



చర్ల మండలంలోని లక్ష్మీకాలనీలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు (ఫైల్)

భద్రాచలంఅర్బన్: వర్షకాలం రానే వచ్చింది. కాలంతో పాటు దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు వ్యాపిస్తాయి. ఈ నేపథ్యాన దోమల నివారణ, వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు దృష్టి సారించారు. ప్రధానంగా దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, చికున్ గున్యా, బోదకాలు, మెదడువాపు, విష జ్వరాలను అరికట్టేందుకు కీటక జనిత ప్రదేశాలను గుర్తించడంతో పాటు నియంత్రణ చర్యలను చేపడుతున్నారు.

వైద్య బృందాల సందర్శన

ఫ్రై డే – డ్రై డే పేరుతో వైద్య బృందాలు నిరంతర ప్రక్రియగా ప్రతి ఇంటిని సందర్శిస్తూ, ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడం, ర్యాలీలు నిర్వహించడం, నీటి నిల్వలను తొలగించేలా యజమానులకు తగిన సూచనలిస్తున్నారు. అంతేకాక ఏ గ్రామం, ప్రాంతంలోనైనా ప్రజలు సీజనల్ వ్యాధులు బారిన పడితే ఆ ప్రాంతంలో ఫీవర్ సర్వే నిర్వహిస్తారు. ఆపై కీటక నియంత్రణ చర్యలు చేపడుతారు. అంతేకాక ఇటీవల జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో జ్వరాలు ప్రబలిన ప్రాంతంలో వైద్యాధికారులు శిబిరాలను ఏర్పాటు చేసి పరీక్షలు చేశారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీలు, పురపాలక సంఘాల ఆధ్వర్యంలో నీటిగుంతల్లో ఆయిల్ బాల్స్ వేయడం, డ్రెయినేజీల్లో స్ప్రే చేయించడం, ఫాగింగ్ చేయడం లాంటి చర్యలు చేపడుతున్నారు. ఇవేకాక నిల్వ నీటిలో గంబూషియా చేపలు వదలనున్నారు.

సమస్యాత్మక గ్రామాలు గుర్తింపు..

2024లో ఇప్పటి వరకు అధికారిక గణాంకాల ప్రకారం జిల్లాలో 32 మలేరియా, 11 డెంగీ, 27 టైఫాయిడ్ కేసులు నమోదయ్యాయి. కానీ అనధికారికంగా వీటి సంఖ్య రెండింతలు ఉంటుందని సమాచారం. ఈనేపథ్యాన వైద్యాధికారులు ఇప్పటికే ఇంటింటి సర్వే చేస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్నవారికి వైద్య పరీక్షలు నిర్వహించి వివరాలు నమోదు చేస్తున్నారు. 2023లో జిల్లాలో 385 మంది టైఫాయిడ్, 182 మంది మలేరియా, 295 మంది డెంగీ బారిన పడ్డారు. ప్రస్తుత సీజన్‌లోనూ అధికారులు పీహెచ్‌సీల వారీగా 171 సమస్యాత్మక గ్రామాలను గుర్తించారు. ఆయా గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో కొంత జాప్యం జరుగుతున్నట్లు కనిపిస్తుండగా సీజనల్ వ్యాధులు వ్యాప్తి కాకముందే అధికారులు వేగంగా నివారణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ నెల 17వ తేదీ వరకు కేవలం ఏడు గ్రామాల్లో మాత్రమే వ్యాధుల వ్యాప్తి నివారణకు రసాయనాలు పిచికారీ చేస్తున్నారు. ఇంకా 164 గ్రామాల్లో పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాల్సి ఉందని వైద్యాధికారులు తెలిపారు.



దోమల వ్యాప్తి నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

అప్రమత్తత అవసరం



మున్సిపాలిటీ, ఇతర సమన్వయ శాఖలతో గ్రామాలు, పట్టణాల్లో అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు కూడా వర్షాకాలం పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉంటూ వ్యక్తిగత, పరిసరాలు పరిశుభ్రత పాటించాలి. జ్వరం, దగ్గు, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు ఉంటే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలి.

– డాక్టర్ శ్రీనివాస్, జిల్లా మలేరియా అధికారి

అందుబాటులో మందులు..



సీజనల్ వ్యాధులు విజృంభించే ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో మా శాఖ అప్రమత్తంగా ఉంది. వరద ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాం. ఇప్పటికే సిబ్బంది ద్వారా సమస్యాత్మక గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అవసరమైన మందులు కూడా అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ బాలాజీనాయక్, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ

రూ.124.48 కోట్లతో తాగునీటి పథకం

- ఈ నెల 27న కొత్తగూడెంలో డిప్యూటీ సీఎం భట్టిచే శంకుస్థాపన
- హాజరు కానున్న ముగ్గురు మంత్రులు, ఇద్దరు ఎంపీలు
- వివరాలు వెల్లడించిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

సింగరేణి(కొత్తగూడెం): ప్రజల దాహార్తి తీర్చేందుకు అమృత్ జల్ పథకం కింద రూ.124.48 కోట్లతో తాగునీటి పథకం పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నిధులతో పైప్‌లైన్లు, ఫిల్టర్‌బెడ్, 25 లక్షల లీటర్ల సామర్థ్యంతో మూడు ట్యాంకులు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. పథకం పనులకు ఈ నెల 27న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేస్తారని, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర హాజరవుతారని వివరించారు. కొత్తగూడెం పట్టణ ప్రజల తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకే ఈ పథకం చేపడుతున్నట్లు తెలిపారు. కిన్నెరసాని నుంచి కొత్తగూడెం మున్సిపాలిటీతో పాటు ఇతర ప్రాంతాలకు సుమారు 150 కిలోమీటర్ల మేర నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేస్తామని, ఇందుకు 60 శాతం కేంద్ర ప్రభుత్వం, 30 శాతం రాష్ట్ర ప్రభుత్వం, 10 శాతం మున్సిపాలిటీ నిధులు వెచ్చిస్తామని చెప్పారు. ఇల్లెందు క్రాస్‌రోడ్ వద్ద 265 లక్షల లీటర్ల నీటి శుద్ధి కేంద్రంతోపాటు, మరో రెండు ట్యాంకులు ఏర్పాటు చేస్తామని, వర్షపు నీరు నిల్వకుండా రూ 4.కోట్లతో విద్యానగర్ నుంచి బైపాస్ రోడ్డు వరకు, పోస్టాఫీస్ సెంటర్ నుంచి గోధుమవాగు బ్రిడ్జి వరకు డ్రెయినేజీ నిర్మిస్తామని వివరించారు.

రూ.30 కోట్లతో మొర్రేడు వాగు బ్రిడ్జిల సుందరీకరణ

రూ.30 కోట్లతో మొర్రేడు వాగు రెండు బ్రిడ్జిలను సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. నియోజకవర్గంలో ఐటీ హబ్, ఇండస్ట్రియల్ పార్క్, ఎయిర్‌పోర్ట్, ఈఎస్‌ఐ ఆస్పత్రి, సింగరేణి షాపింగ్ మాల్, సింగరేణి కమ్యూనిటీ హాల్, టూరిజం హోటల్ అభివృద్ధి, కేంద్రీయ విద్యాలయాలు, జేఎన్‌టీయూలో మైనింగ్ స్కూల్‌ను మెర్జ్‌చేసి యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. స్పోర్ట్స్ స్టేడియం, పాల్వంచలో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్, ఎస్‌ఎండీసీ స్థానంలో మరో కొత్త ప్రాజెక్ట్ నెలకొల్పేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం బొగ్గు గనులను వేలం వేస్తోందని ఆరోపించారు. ఆమరణ దీక్ష చేసైనా సింగరేణి సంస్థను పరిరక్షించుకుంటామని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కాసుల ఉమారాణి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాష, చంద్రగిరి శ్రీనివాస్, దుర్గరాశి వెంకన్న, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, మునిగడప వెంకటేశ్వర్లు, వివిధ వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కలప డిపోలో ఇసుక లారీ

- వివాదాస్పదంగా మారిన వాహనం పట్టివేత
- అటవీశాఖ రేంజర్‌కు లారీ ఓనర్ నోటీసులు



అటవీశాఖ అధికారులు పట్టుకుని కలప డిపోలో నిలిపిన ఇసుక లారీ

పాల్వంచరూరల్: అటవీశాఖ అధికారులు చెక్ పోస్టు వద్ద ఇసుక లారీని పట్టుకున్న ఘటన వివాదాస్పదంగా మారింది. ఈ నెల16న ఇసుక లోడ్ లారీ మణుగూరు నుంచి పాల్వంచ వైపు వస్తుండగా బూర్గంపాడు మండలం బంజరలోని అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద బీట్ ఆఫీసర్ పట్టుకున్నారు. రేంజర్ అనిల్‌కుమార్‌కు అప్పగించగా, నిబంధనలు ఉల్లంఘించి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారంటూ లారీని పాల్వంచలోని కలప డిపోకు తరలించారు. ఇసుక తరలింపునకు అనుమతులు ఉన్నాయని లారీ డ్రైవర్ రాంబాబు చెప్పిన పట్టించుకోకపోవడంతో అటవీశాఖ సిబ్బందికి, లారీ డ్రైవర్‌కు వాగ్వాదం జరిగింది. కాగా ఇసుక తరలించేందుకు అనుమతి ఉన్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోలేదని, అసలు అటవీశాఖ అధికారులకు ఇసుక లారీని పట్టుకునే హక్కులేదని పేర్కొంటూ లారీ ఓనర్ పీవీ చారి అటవీశాఖ అధికారిపై పరువునష్టం దావా వేసి, రేంజర్‌కు లాయర్ ద్వారా నోటీసులు ఇచ్చారు. కాగా అటవీశాఖ అధికారులు తమ పరిధి దాటి ప్రధాన రహదారిపై తరలించే ఇసుక, మట్టి లారీలను కూడా పట్టుకుని వేధిస్తున్నారని స్థానికుడు కనగాల అనంతరాములు ఆరోపిస్తున్నారు. పట్టా భూమి నుంచి మట్టి తరలిస్తుండగా ఇటీవల బస్వతారక కాలనీ వద్ద వెంకట్‌రెడ్డి అనే లారీ యజమానిని అటవీశాఖ సిబ్బంది డబ్బులు డిమాండ్ చేశారని, దీంతో ఆయనకు బీపీ పెరిగి కిందపడిపోవడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని పేర్కొన్నారు. తమ పరిధి దాటి వ్యవహరిస్తున్న అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యేను కోరారు.

అనుమానాస్పదంగా తిరుగుతుంటే పట్టుకున్నాం

ఇసుక లారీ రెండుసార్లు అనుమానాస్పదంగా తిరుగుతుంటే చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నాం. మైనింగ్ అధికారుల నుంచి సమాచారం తెలుసుకుంటే ఒక ట్రిప్పు ఇసుకకు అనుమతి తీసుకుని, రెండుసార్లు తిరిగినట్లు చెక్ పోస్టువద్ద ఉన్న సీసీ కెమెరాలో రికార్డు అయింది. దీంతో అనుమానంతో పట్టుకుని మైనింగ్ ఏడీకి అప్పగించగా లారీని కలప డిపోలో ఉంచారు.

–అనిల్‌కుమార్, పాల్వంచ రేంజర్

రూ.50 వేల జరిమానా

ఇటీవల ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద అటవీశాఖ అధికారులు ఇసుక లారీని పట్టుకుని మాకు అప్పగించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తుంటే రూ.50 వేల జరిమానా విధించాం.

–దినేష్, మైనింగ్ ఏడీ

అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు

- వ్యవసాయ క్షేత్రంలో పద్మశ్రీ రామచంద్రయ్య అంత్యక్రియలు
- సాధారణ లాంఛనాలతోనే నిర్వహణ
- ఏర్పాట్లు పర్యవేక్షించిన గిరిజన సంక్షేమ శాఖ అధికారులు
- చివరి కోరిక తీర్చలేదని కుటుంబ సభ్యుల ఆవేదన



రామచంద్రయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు తదితరులు



అంతిమయాత్ర నిర్వహిస్తున్న కుటుంబసభ్యులు, గ్రామస్తులు

మణుగూరు టౌన్: కంచుతాళం – కంచుమేళం డోలు వాయిద్యకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిని రామచంద్రయ్య దహన సంస్కారాలు సోమవారం మధ్యాహ్నం ముగిశాయి. కలెక్టర్ జితేష్ వి పాటిల్ హామీ మేరకు అధికార లాంఛనాలతో నిర్వహిస్తారని కుటుంబసభ్యులు భావించినా.. చివరకు సాధారణ పద్ధతిలోనే ముగించారు. మణుగూరు మండలం బావి కూనవరం గ్రామంలో రామచంద్రయ్య నివాసం నుంచి ప్రారంభమైన అంతిమయాత్ర గ్రామస్తులు, కుటుంబసభ్యుల అశ్రునయనాల మధ్య ఆయన వ్యవసాయ క్షేత్రం వరకు కొనసాగగా.. కుమారుడు సకిని బాబూరావు రామచంద్రయ్య భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించారు.

రూ.20 వేలు అందజేత..

పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిని రామచంద్రయ్య కోయ దొరల ఇలవేల్పు సమ్మక్క – సారలమ్మ కథను వివరిస్తూ కంచు తాళం, కంచుమేళం వాయించి దేశ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చారు. ఈ క్రమంలో ఆయనకు 2022లో పద్మశ్రీ పురస్కారం దక్కింది. రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి నజరానా, 426 చదరపు గజాల స్థలం, ఆర్ట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే అవన్నీ కాగితాలకే పరిమితమయ్యాయని, పద్మశ్రీ గ్రహీతను రాష్ట్ర ప్రభుత్వం అగౌరవపరుస్తోందని, కనీసం అంత్యక్రియలైనా అధికార లాంఛనాలతో నిర్వహించాలని రామచంద్రయ్య కుటుంబసభ్యులు కోరారు. అయితే అధికార లాంఛనాలతో నిర్వహణ సాధ్యం కాదని గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ, ఏటీడీఓ నర్సింహారావు స్పష్టం చేశారు. తోటి ఉద్యోగి మృతి చెందితే ఆనవాయితీగా అందించే రూ.20 వేలు దహన సంస్కారాల నిమిత్తం అందజేశారు. కంచుతాళం– కంచుమేళం కళ అంతరించిపోకూడదనే ఉద్దేశంతో రామచంద్రయ్యను ఐటీడీఏ కార్యాలయంలో ఆర్ట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా గౌరవించిన అధికారులు.. ఏరోజూ గౌరవ వేతనం రూ.25 వేలు అందజేయలేదని, ఇప్పుడు తోటి ఉద్యోగి అనడంలో ఆంతర్యం ఏంటని అధికారులను కుటుంబ సభ్యులు నిలదీశారు. దీంతో మాటమార్చిన అధికారులు గిరిజన సంక్షేమ శాఖ తరఫున మాత్రమే ఇస్తున్నామని వివరించారు. కాగా, కలెక్టర్ ఆదేశాల మేరకు పినపాక నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు అంతిమయాత్రకు హాజరయ్యారు.

పలువురి పరామర్శ..

భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, పీసీసీ సభ్యుడు చందా సంతోష్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య, మణుగూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పిరినాకి నవీన్, శివ సైదులు, ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, వట్టం నారాయణ దొర, పొడియం బాలరాజు, భిక్షపతి తదితరులు రామచంద్రయ్య మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

బూర్గంపాడు: సారపాకకు చెందిన ఓ చిన్నారిపై బిహార్‌కు చెందిన ఓ వలస కార్మికుడు లైంగిక దాడికి యత్నించాడు. చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రం నుంచి వలస కార్మికుడిగా వచ్చిన కుండ్రామ్ అనే వ్యక్తి సారపాకలోని ఓ కార్మికవాడలో ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం ఆ వీధిలో ఆడుకుంటున్న ఓ చిన్నారికి తినుబండరాల ఆశ చూపించి ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. ఆ చిన్నారి ఏడుస్తూ ఇంటికి వచ్చి తల్లిదండ్రులకు జరిగిన విషయం చెప్పింది. వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితుడు కుండ్రామ్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

ఇసుక లారీ సీజ్

మణుగూరు టౌన్: మంగపేట శివారు రాజుపేట వద్ద చుంచుపల్లి ఇసుక ర్యాంప్ నుంచి అక్రమంగా ఆంధ్రకు ఇసుక తరలిస్తున్న లారీని సోమవారం మణుగూరు సీఐ సతీష్‌కుమార్ పట్టుకున్నారు. బ్రహ్మారాజు, తోక రాకేశ్‌లు, కలపాల వెంకటేశ్వర్లు కలిసి గోదావరి ర్యాంప్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా మణుగూరు శివారు ప్రాంతమైన హనుమాన్ ఆలయం వద్ద స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పరస్పరం ఫిర్యాదులు : కేసులు నమోదు

జూలూరుపాడు: బ్లేడ్‌తో దాడి చేసిన ఘటనలో సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ బి తిరుపతిరావు కథనం ప్రకారం... టేకులపల్లి మండలం రామచంద్రంపేటకు చెందిన చింతల కుమారస్వామి తన భార్య వైష్ణవి కాపురానికి రావడంలేదని ఆదివారం పెద్దమనుషులను తీసుకుని రామచంద్రాపురంలోని అత్తగారింటికి వచ్చాడు. పంచాయితీ జరుగుతుండగా, కుమారస్వామి తన భార్యపై దాడి చేసేందుకు ప్రయత్నించాడు. ఆమె బంధువు సరెం నాగరాజు అడ్డురాగా, అతని మెడపై బ్లేడ్‌తో కోయగా తీవ్ర గాయమైంది. బాధితుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కుమారస్వామిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా దాడి అనంతరం వైష్ణవితోపాటు, ఆమె బంధువులు కలిసి కుమారస్వామికి దేహశుద్ధి చేసి, గదిలో బంధించారు. తీవ్ర గాయాలై కుమారస్వామి ఫిర్యాదు చేయగా, భార్య వైష్ణవి, బంధువులు సావిత్రి, విష్ణు, పాపారావు, నాగరాజులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

దాడి ఘటనలో..

పాల్వంచ: పాత కక్షల నేపథ్యంలో పట్టణంలోని శేఖరం బంజరకు చెందిన బానోతు చందుపై అతని సోదరుడు నగేష్, మరో సోదరుడి కుమారుడు కిషోర్ దాడి చేసి, మురికి కాల్వలో పడేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.రాము తెలిపారు.

భద్రాచలంలో..

భద్రాచలంటౌన్: పట్టణంలోని అశోక్‌నగర్ కొత్త కాలనీకి చెందిన షేక్ చాంద్‌పాషాపై అతని బంధువు సుబాన్ గనీ గొడవకు దిగి, ఇటుకతో దాడి చేశాడు. దీంతో చాంద్‌పాషాకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదుతో ఎస్‌ఐ పీవీఎన్ రావు కేసు నమోదు చేశారు.

ఆటోను ఢీకొట్టిన కారు

- ఆటో డ్రైవర్‌తోపాటు నలుగురు ప్రయాణికులకు గాయాలు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ అబ్దుల్ రెహమాన్



ప్రమాదస్థలిని పరిశీలిస్తున్న కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

కొత్తగూడెంటౌన్: రాంగ్ రూట్‌లో వచ్చిన కారు ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురు గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన కొత్తగూడెం పట్టణంలోని రుద్రంపూర్‌లో సోమవారం జరిగింది. స్థానికులు, బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. చండ్రుగొండకు చెందిన ఆటోడ్రైవర్ కమల్‌పాషా ఆటోలో రాంపురానికి చెందిన వేముల ధనలక్ష్మి, చింతా సుజాత, చండ్రుగొండ మండలం మద్దుకూరుకు చెందిన లారీ డ్రైవర్ బద్దం పెంటయ్య, చండ్రుగొండకు చెందిన కంచర్ల వెంకటేశ్వర్లు పాల్వంచలోని ఐడీఓసీ(కలెక్టరేట్)కు వచ్చారు. అక్కడ కార్మిక శాఖలో రుణం కోసం దరఖాస్తు చేసుకుని తిరిగి వెళ్తున్నారు. అదే సమయంలో పెనగడప పంచాయతీ పీహెచ్‌సీ డాక్టర్ నేహా అమీన్ పెనగడప నుంచి కొత్తగూనికి కారులో వస్తోంది. ఈ క్రమంలో రుద్రంపూర్ పార్క్ వద్ద విజయవాడ బస్టాప్ ముందు ఉన్న రోడ్డు వద్దకు చేరుకోగానే.. కారు రాంగ్‌రూట్‌లో వచ్చి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో డ్రైవర్ సహా ఐదుగురు గాయపడ్డారు. రోడ్డుపై చెల్లాచెదరుగా పడిపోయారు. స్థానికులు స్పందించి పోలీసులకు, 108కు సమాచారం ఇచ్చారు. వైద్యులు అక్కడికి చేరుకుని క్షతగాత్రులకు ప్రథమ చికిత్సను అందించి జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వేముల ధనలక్ష్మి పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. బద్దం పెంటయ్యకు కూడా తీవ్రగాయాలుకాగా చికిత్స అందిస్తూ వైద్యులు పర్యవేక్షిస్తున్నారు. మిగిలిన ముగ్గురికి తలకు, కాళ్లకు స్వల్ప గాయాలుకాగా చికిత్స పొందుతున్నారు. కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. కారు, ఆటోలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రోడ్డు ప్రమాదానికి కారణమైన వైద్యురాలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు కొత్తగూడెం టూటౌన్ పోలీసులు తెలిపారు.



తీవ్రంగా గాయపడ్డ వేముల ధనలక్ష్మి

గుండెపోటుతో ఛత్తీస్‌గఢ్ వాసి మృతి



హర్జిదర్ సింగ్ మృతదేహం

దమ్మపేట: రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న లారీకి కాపలా ఉండేందుకు వచ్చిన ఛత్తీస్‌గఢ్ వాసి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని గుర్వాయిగూడెం గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ సాయికిషోర్ రెడ్డి కథనం ప్రకారం.. ఈ నెల 18న రైల్వేట్రాక్ పట్టాల లోడుతో వెళ్తున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో, అదుపుతప్పి పడిపోయి లారీ డ్రైవర్ మృతి చెందిన సంగతి తెలిసిందే. కాగా ఈ ప్రమాదంలో లారీ ధ్వంసం కాగా, కాపలా ఉండేందుకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన హర్జిదర్ సింగ్ (50) ఆదివారం గుర్వాయిగూడేనికి వచ్చాడు. అదే గ్రామంలోని ఓ ఇంటి బయట ఉన్న షెడ్డులో నిద్రించగా తెల్లవారుజామున ఫిట్స్‌తోపాటు గుండెపోటుకు గురై మంచంపై నుంచి కింద పడి మృతి చెందాడు. తెల్లవారిన తర్వాత గుర్తించిన స్థానికులు పోలీసులకు, 108కు సమాచారం అందించారు. వైద్య సిబ్బంది పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ వివరాలు సేకరించి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఐదు మేకలు మృతి

దమ్మపేట: మండల కేంద్రంలోని బంజారా కాలనీలో సోమవారం విద్యుదాఘాతంతో ఐదు మేకలు మృతి చెందాయి. కాలనీకి చెందిన తిమ్మరాజు కేశవరావు రేకుల షెడ్డులో మేకలను కట్టేసి ఉంచాడు. తెల్లవారుజామున షెడ్డుకు ఏర్పాటు చేసిన ఐరన్ మెస్‌కు కరెంట్ వైరు నుంచి విద్యుత్ ప్రసారం కాగా, షాక్‌కు గురై మేకలు మృతి చెందాయి. రూ.1.20 లక్షలు నష్టపోయినట్లు బాధితుడు వాపోయాడు.